వాఘిరా

"ఏమండీ, నిద్రలేచారా? పళ్ళుతోమి ముఖం కడుక్కున్నారా? పేపరు చూడ్డమయిందా? ఏమండీ, ప్లీజ్. బిడ్డకు తీసివేతలు సరిగ్గా రావడం లేదండీ. హోమ్‌వర్కులో హేమకు కాస్త సాయపడరూ? స్నానానికి నీళ్ళు తోడేశా, వేడినీళ్ళెక్కడైనా అట్లాగే దిమ్మరించుకునేరు! చన్నీళ్ళు కలుపుకోవాలి. టిఫిన్ చేస్తున్నా కదండీ. బాబ్బాబూ - అట్లాగే హేమకుగూడా స్నానం కానియ్యరూ? ఆ పిల్ల యూనిఫామ్ బీరువాలో, కింది సొరుగులో ఉంటుంది చూడండి. గోధుమ రంగు ప్యాంటు ఇస్త్రీచేసి పెట్టాను. దానిపైకి తెల్ల గళ్ళ చొక్కా బాగుంటుంది. రెండూ ఒకచోట పై సొరుగులో ఉన్నాయి తీసుకోండి. ఒక కర్చీఫ్ తీసి జేబులో పెట్టుకోడం మరచిపోవద్దు. హేమకు క్యారియర్ సర్దేశాను. ఎదురింటి మీనా ఇంట్లో ఉందో, అప్పుడే వెళ్ళిపోయిందో చూడరూ? ఏమిటండీ ఆ అమ్మాయి మరీను. హేమకు తోడే ఇవ్వనంటుంది. అది లేకపోతే మనమెవరైనా వెళ్ళి కాన్వెంటులో దిగవిడిచి రావలసిందే."

ఇదండీ వరుస! మా ఇంట్లో ఉదయాలు ఇలా మా వసంతలక్ష్మి సూచనలు, సలహాలు, హెచ్చరికల మేరకే రూపొందుతాయి. ఒకరోజిట్లాగే ఆవిడ అభ్యర్థనపైన వరండాలోకి వెళ్ళి, ఎదురింటి మీనాకోసం చూస్తుండగా మా కింది వాటా పూలతోటలో క్రోటన్ మొక్కల నడుమ చిన్న ఆకారమేదో కదులుతున్నట్లు తోచింది. "ఎవరు, ఎవరక్కడ?" అని పలకరించాను.

"నేనండీ అంకుల్, వాగిరాని! ఏమకోసం వొచ్చా."

ఈలోగా "ఎవరు నాన్నా" అంటూ పరుగెత్తుకొచ్చి, పిట్టగోడపై నుంచీ కిందికి తొంగి చూచింది హేమ. "వాగిరా! వొచ్చేశావా! ఉండొత్తున్నా" అంటూ ఒకచేత పుస్తకాల సంచీ, మరొకచేత మధ్యాహ్నవేళ భోజన భాజనాల సంచీ మోసుకుంటూ మెట్లు దిగిపోయింది.

'వాఘిరా! ఏం పేరో అది! ఎవరో కొత్త పిల్లలా ఉంది' – స్వగతంలా చెప్పుకుంటూ హాల్లోకి వెళ్ళాను.

"అదీ నాలాంటి దిక్కులేని పిల్లేలెండి! ఎందుకు పుట్టిస్తాడో దేవుడు నాలాంటి వాళ్ళని."

'ఏమిట్రా ఈ విడ్డూరం! క్షణంలో సగంసేపు పట్టలేదు – అంతలోనే ఈ ముఖబింబంపైన మబ్బుతెరలలుముకున్నాయేమిటి' అనుకుంటూ ఆశ్చర్యపడిపోయాను.

ఎవరికెదురైనాసరే, విషాదయోగం చాలా పెద్దది. అర్జునుని విషాద యోగాన్ని పటాపంచలు చేయడానికైతే శ్రీకృష్ణునిలాంటి పరమాత్ముడొకడు దొరికిపోయాడు. మా వసంత విషాదం ఓదార్పు కతీతమైందని నేను పెళ్ళయిన కొత్తలోనే గ్రహించాను. వరుసగా ఆడపిల్లలే కలగడంవల్ల భర్తతోపాటు అతనివైపు బంధువులందరూ తన తల్లిని ఈసడించుకోడం, నాలుగో బిడ్డ కలిగినప్పుడు ఆమె ఎదుటికి వెళ్ళి పరామర్శించడానికైనా భర్త నిరాకరించడం, జీవితంపట్ల విరక్తి చెంది, అప్పుడిక పథ్యాలు పాటించక ఆమె

చావును కొనితెచ్చుకోవడం, అదృష్టవశాత్తూ తన తోబుట్టువులందరూ కాలం కడుపులో బుడుంగుమనడం, దురదృష్టంకొద్దీ తానొక్కర్తై మాత్రం బతికిపోవడం, సవతితల్లి దయాదాక్షిణ్యాల పైన ఆధారపడి బతకాల్సిరావడం, ఒకే పావడా ఉతికి, పిండి కట్టుకోవలసిన దుఃస్థితి దాపురించడం, రెండో భార్య మాయలకు వశుడైనప్పుడు తండ్రి తనని చచ్చేదీ బతికేదీ తెలియకుండా చింతబరికెతో కొట్టడం, తననెట్లాగైనా వదిలించుకోవాలన్న ఏకైక సంకల్పంతోనే తండ్రీ, ఆయన ప్రియసతీ తనకు పెళ్ళి తలపెట్టడం, ఆమెనిచ్చి పెళ్ళి చేయడానికి వాళ్ళాశించిన శుద్ధబుద్ధావతార లక్షణాలు నాలో పుష్కలంగా కనిపించడం - ఇలా ఆ ఫ్లాష్ బ్యాక్ దృశ్యాలన్నీ ఆమె మనసులోకి వచ్చేస్తే చాలా ప్రమాదం.

పెళ్ళయిననాటి సాయంకాలం వసంత మేనమామ ఒకాయన నన్ను దూరంగా తీసుకెళ్ళి, "బాబూ, తల్లిని పోగొట్టుకుని, తండ్రి వాత్సల్యానికి దూరమై, మారుతల్లి ఆరళ్ళకు గురై ఈ బిడ్డ పడరాని పాట్లు పడింది. ఇకమీదట సుఖపడితే నీ మూలంగానే సుఖపడాలి" అంటూ కొన్ని అప్పగింత మాటలు నా చెవిలో వేశాడు.

అయితే, జీవితమనే నాణెంలో బొరుసువైపు ఒకటుందని తెలియకుండా కుమారుణ్ణి కాపాడుకోడం శుద్ధోధనుడనే మహారాజుకే సాధ్యం కాలేదు. ఇక నేనెంతటివాణ్ణి? ఒక భర్త భార్యను యాతనలపాలు చేస్తున్నాడని గానీ, ఒక అత్త కోడల్ని రాచి రంపాన పెడుతోందనిగానీ, ఒక పసిబిడ్డ బతుకు సవతితల్లి పెంపకంలో వ్యథామయమై పోతోందనిగానీ తెలిసినప్పుడు వసంత తల్లకిందులైపోతుంది. కనుగుడ్ల కొలనుల్లో కన్నీళ్ళు నిండిపోతాయి. గదిలోకి వెళ్ళి ఏడుస్తూ కూచుంటుంది.

ప్రపంచంలో కొన్ని కొన్ని నదుల్ని 'దుఃఖదాయిని' అంటారట. ఇక్కడిప్పుడు దుఃఖదాయిని ఇందాకా కనిపించిన పిల్ల రూపంలో మా ఇంటి చేరువకు వచ్చేసిందేమోనని నేననుమానించాను. రాకపోతే ఉంగరపు వేలితో కనుకొలకుల్లో ఏర్పడిన చెమ్మదనాన్ని తుడుచుకుంటూ వసంత ఎందుకు గది లోపలికి వెళ్ళిపోతుంది?

'వద్దు బాబూ వద్దు. ఆ పిల్ల ప్రసక్తి తీసుకురానేవద్దు' అని నాలో నేను అనుకున్నాను.

అయితే, నా ప్రయత్నాన్ని కతీతంగా ఆ పిల్ల ప్రసక్తి మా గృహవాతావరణంలోకి చొచ్చుకరావడం అనివార్యమై పోయింది.

ఆరోజు రాత్రి తల్లి కలిపి పెడుతున్న అన్నం తింటూ హేమ చెబుతుండగా విన్నాను- "అమ్మా, అమ్మా! మధ్యాన్నం వాగిరా అన్నమే తెచ్చుకోలేదు. క్యారియర్ ఖాళీ!"

"అయితే, ఏం చేసింది? పస్తే ఉండిపోయిందా హేమా?" - నాకు కూడా రోగాలూ, రొష్టులూ వచ్చేస్తాయా - అన్నప్పటి సిద్ధార్థుడి ఆక్రోశం ఆ ప్రశ్నలో ధ్వనించింది.

"లేదులే! ఇద్దరమూ నా క్యారియర్ అన్నమే తినేశాము..."

"నా తల్లీ! నా బంగారుతల్లీ!" అన్న మాటలతోపాటు అమాంతంగా బిగ్గరగా ముద్దులవర్షం కురిపించడం విన్నాను.

ఉన్న అన్నం కాస్తా యాచకులకు పెట్టేసి, ఆ తరువాత ఎవడో వస్తే, 'అన్నము లేదు, కొన్ని మధురాంబువులున్నవి' అన్న రంతిదేవుడిలా, నా భార్యాబిడ్డలు దానవీర

పాత్రల్ని పోషించడం నాకట్టే రుచించడంలేదు. అయినా, అప్పటికి తేలు కుట్టిన దొంగలా ఊరకుండిపోయాను. వసంత వంటగది సర్దుకుంటూ ఉండగా హేమ నా గదిలోకి వచ్చిన మొదటి అవకాశాన్ని పురస్కరించుకుని వీలయినంత మిత్రసమ్మితంగానే ఉపదేశం చేశాను. "చూడమ్మా, హేమా! వీధంట వెళ్ళే దానయ్యలెందరో ఉంటారు. వాళ్ళ జోలి మనకెందుకు? ఆ వాఘిరా పిల్లగూడా అంతేననుకో, 'నువ్వు మా ఇంటికి రావద్దు' అని చెప్పేయ్! దాని సంగతులేవీ మీ అమ్మతోనూ చెప్పొద్దు, ఏం సరేనా."

నా మాటలేవీ తనకర్థం కానట్లు అయోమయంగా చూస్తూ, ఈయనతో మనకెందుకులెమ్మన్నట్లు మౌనంగా ఉండిపోయింది హేమ.

బడివేళ కావస్తోందనగా హేమ తన నేస్తం కోసం వేచిచూడడం, ఆ పిల్ల రాగానే 'ఒచ్చేసిందొచ్చేసిం'దంటూ దూసుకుపోవడం, తల్లీకూతుళ్ళిద్దరూ హమేషా ఆ పిల్లను గురించిన కబుర్లలోనే మునిగితేలడం - ఇదంతా మా ఇంట్లో ఒక మామూలు వ్యవహారమైపోయింది. కథ అంతటితో ఆగిపోతే బాగుండునని నా నిరాసక్తితోనే ఆనకట్ట వేయజూచాను. అయితే, ఒకనాటి ఉదయం తెల్లవారేసరికి నా ఆనకట్ట నామరూపాలు లేకుండా కొట్టుకుపోయింది. అక్కడినుంచి వాఘిరా వృత్తాంతం వర్షాకాలం నాటి వరద గోదావరిలా గట్లను ముంచేస్తూ ముందుకొచ్చేసింది.

కింది వాటావాళ్ళు ఇంటికి తాళం వేసుకుని ఊరికి వెళ్ళిన సమయం. సాయంకాలం బడి వదిలిపెట్టారు. ఆ చోటు, ఆ వేళగూడా ఆడుకోడానికి చాలా అనువైనవిగా తోచిందేమో, పిల్లలిద్దరూ పొద్దుపోయేదాకా కింది పూలతోటలో ఆడుకుంటూ ఉండిపోయారు. ఆడి, ఆడి అలసిపోయిన తర్వాత హేమ గసపోసుకుంటూ పైకి వచ్చేసింది.

మరునాటి ఉదయం సూర్యోదయంతోపాటుగా మెట్లెక్కి వచ్చిన పెరుగమ్మి "అక్కా! అక్కా! మెట్లకు, గోడకు మద్దెనబడి ఒక పిల్ల ఆదమరచి నిద్రపోతూ ఉంది. ఎవరమ్మా ఆ పిల్ల" అంటూ ఓ వర్తమానం బయటపెట్టింది.

వసంత ముఖం వెలవెలపోయింది. ఆమె పెదవులు వడగాలిలో మృదుపత్రాల్లా చలించిపోయాయి. కోపాతిరేకం వల్ల కాళ్ళు, చేతులూ వణికిపోసాగాయి. ఒక్కో విడతకు రెండేసి మెట్లు చొప్పున దిగి, బిడ్డనట్లాగే పైకెత్తి భుజాలపైన వేసుకుని పైకొచ్చేసింది. నాకోసం ఫ్లాస్కులో పోసి పెట్టిన కాఫీ ఆ పిల్లకు తాపించింది. బ్రెడ్ ముక్కలను జామ్ పూసి తినిపించింది. 'రాత్రిగూడా తిండి లేదండీ పాపం! ఆకలిగా ఉండదూ' అంటూ సాభిప్రాయంగా నావైపు చూచింది.

అప్పుడిక వళ్ళు తోమి, స్నానం చేయించి, హేమ యూనిఫారం దుస్తులే తొడిగి, ఇద్దరికీ తల దువ్వి, పౌడరద్ది, బొట్టు పెట్టి, క్యారియర్లు సర్ది, జుత్తు గట్టిగా ముడివేసుకుని, చీరకొంగు నడుముకు బిగించి బయల్దేరింది.

"ఎక్కడికి వసంతా?" భయం భయంగానే అడిగాను.

"ఎక్కడికని మెల్లగా అడుగుతున్నారా? ఈ పిల్లకు కన్నవాళ్ళుగానీ, పెంచిన వాళ్ళుగానీ లేరా? ఉంటే వాళ్ళు ఏం తింటున్నారు? అన్నం తింటున్నారా? గడ్డి తింటున్నారా? ఒకరోజు రాత్రంతా బిడ్డ ఇంటికి రాకపోతే పట్టించుకోరా? అడగనా

మరి! నా ప్రశ్నకు సమాధానం రాకపోతే పదిమందినీ ఒకేచోట చేర్చి, వాళ్ళచేత అన్యాయం ఒప్పించేదాకా ఊరుకుంటానా?"

బిడ్డలిద్దరూ వెంబడించగా చకచకా వీర సిపాయిలా కిందికి దిగిపోయింది వసంత.

నాలో నేను భయపడిపోతూ ఇంటిపట్టునే ఉండిపోయాను. వసంత పదిగంటలకైనా తిరిగొస్తుందేమోనన్న నా ఆశ అడియాస అయిపోయింది. ఇంటికి తాళం వేసి, తాళం చెవి ఎదురింట్లో ఇచ్చి నేను ఆఫీసుకు వెళ్ళిపోయాను.

సాయంకాలం నేను ఇల్లు చేరేసరికి సమగ్రమైన నివేదికతోసహా వసంత సిద్ధంగా ఉంది.

***

లోకుల్ని మభ్యపెడుతూ జీవించదలచుకున్నవాణ్ణి, జీవితమే మభ్యపెడుతుందని ఆదిమూర్తికి తెలియదు. అతను చిరునామాలేని వ్యక్తిగా హైదరాబాద్‌లో అడుగుపెట్టాడు. కొత్త ఉద్యోగంలో, కొత్త పరిసరాల్లో, కొత్త చిరునామా సంపాదించుకున్నాడు. ఉద్యోగం చిన్నదే అయినా, పైరాబడికి సదుపాయాలుండడం బాగా కలసి వచ్చింది. డబ్బుకు కొదువలేదు. జల్సాగా ఖర్చుపెట్టేవాడు. నిష్పూచీగా, నిష్చేచీగా తిరణాలలో పూలరంగనిలా తిరగాలన్నదే ధ్యేయం. తన అభిరుచులకు తగిన గర్ల్ ఫ్రెండ్‌ని అన్వేషించడమే అప్పట్లో అతని 'హాబీ' అయిపోయింది. బస్‌స్టాపులు, పార్కులు, చెరువుకట్టలు ఆ రోజుల్లో అతడి విహారభూములు. నిక్షేపంకోసం దేశమంతా వెదికినవాడికి, అదికాస్తా పెరట్లోనే దొరికినట్లు, తనూజ అతనికి చేతికందేటంత దూరంలోనే తారసిల్లింది. నాలుగిళ్ళకవతల అపార్టు మెంటులో ఉండేది. స్థిరమైన ప్రభుత్వ నౌకరీ ఆమెకున్న అదనపు క్వాలిఫికేషన్. పరిచయం స్నేహమైంది. ఆమెదగ్గర తనదేదో పెద్ద ఉద్యోగమేనని పోజు పెడుతుండేవాడు ఆదిమూర్తి. ప్రతిరాత్రి డిన్నర్లు, ప్రతి వారాంతంలోనూ పర్యటనలు రివాజైపోయాయి. కాలం గజ్జెల గుర్రంలా పరుగెత్తింది. క్రమక్రమంగా ఒకే కప్పు కిందికి వచ్చేశారు. లోకం భార్యా భర్తలుగానే గుర్తిస్తోంది. పెళ్ళి చేసుకోడమైనా లోకం గుర్తింపుకోసమే గదా! అయినా, వివాహబంధం లేకుండా స్త్రీ, పురుషులు కలిసి జీవించడానికి వీల్లేదా! ఎందుకు వీల్లేదు? వీలవుతుందని నిరూపించడమే వాళ్ళ మహదాశయమై పోయింది. ఒక గొప్ప ప్రయోజనాన్ని ఆశించి, వినూత్న ప్రయోగంలో లీనమైన విజ్ఞాన శాస్త్రజ్ఞుల ఉత్సాహ ఉద్వేగాలు వాళ్ళలో సందడించాయి. ఈలోగా తనూజలో గర్భలక్షణాలు పొడచూపాయి. సహజ పరిణామమే అయినా, ఎవరో తమపైన కుట్ర పన్నినట్టుగా ఉంది. పుట్టిన బిడ్డల్ని పెంచి పోషించడానికి వేరే వ్యవస్థ ఒకటి లేకపోవడం కొన్ని వేల ఏండ్ల మానవ నాగరికతను అపహాస్యం చేయడం లేదా? నాగరిక దేశాల్లో ఏవో ప్రయత్నాలు జరుగుతున్నట్టు వినికిడి. ఏమైనా, ఈ బిడ్డల బాదరబందీకి తరుణోపాయం కనిపెట్టాలి. ఈ ప్రయత్నం తమ దగ్గరినుంచే ఎందుకు ప్రారంభం కాకూడదు? ఇలా తర్కవితర్కాలు పడుతుండగానే అబార్షన్ వ్యవధి దాటిపోయింది.

అలాంటి జీవన్మరణ సమస్యలోనుంచి వాఫిరా బుల్లి బుల్లి కళ్ళు తెరిచి లోకంవైపు చూసింది. బిడ్డ పెంపకంకోసం ఒక ఆయాను నియమించడమైంది. అయితే, ఈ బిడ్డ

తననొక కట్టుగూటానికి కట్టి పడేస్తుందేమోనన్న ఉక్రోషం తనూజలో ఉచ్చులు తెంచుకుంది. ఈ చిరాకులో పాత స్నేహితుడంటేగూడా ముఖం మొత్తింది. కొత్త స్నేహాలకోసం వెంపర్లాడసాగింది. సహోద్యోగిని అయిన ఓ పంజాబీ అమ్మాయితో కలసి తిరుగుతూ, రాత్రి బాగా తామసమైన తర్వాత తిరిగొస్తుండేది. ఆ పంజాబీ అమ్మాయి ఇంట్లో మగవాళ్ళు కొందరు ఉండి ఉండగూడదా? వాళ్ళకోసం వెళ్ళి వస్తోందనుకోడానికి అవకాశాలు లేవా? ఈ అనుమానం ఆదిమూర్తి మనసును వేరుపురుగులా తొలిచి వేయసాగింది. ఆ కసి తీర్చుకోడానికన్నట్టుగా లోకంలో ఎన్నెన్ని వ్యసనాలైతే ఉన్నాయో, వాటి కన్నింటికీ అవధులు కనిపెట్టె ప్రయత్నంలో ముమ్మరంగా జొరబడిపోయాడు. ఆఫీసు డబ్బు గల్లంతు కావడం మొదలైంది. అనుమానితుడు ఆదిమూర్తే అపరాధిగా నిరూపణ కావడంతో ఉద్యోగం ఊడింది. ఇంట్లో ఒక మంచి మాటలేదు. చేత ఒక చిల్లిగవ్వలేదు. ఆదిమూర్తి జీవితంలో అది అమావాస్య చీకటి. తన నిస్సహాయ స్థితి ఏమిటో తనకు తెలిసొచ్చిన కాలం. తనూజను సంస్కరించవచ్చుననిగానీ, ఆమెతో సహజీవనం నెరపవచ్చుననిగానీ ఆశ అడుగంటిపోయిన తర్వాత అతను మానాభిమానాలు చంపుకుని ఒక రాజీ ఒప్పందాన్ని ప్రతిపాదించాడు. దాని మేరకు తనూజ తనకెంతో కొంత పెద్ద మొత్తాన్నే ముట్టజెప్పాలి. అంతటితో తానామె జీవితం దరిదాపుల్లో ఉండకుండా ఎక్కడికైనా వెళ్ళిపోతాడు.

కొద్ది రోజులపాటు తీవ్రంగా ఆలోచించిన మీదట ఒకటి, రెండు సవరణలతో తనూజ ఈ ఒప్పందానికి అంగీకారం ప్రకటించింది.

నెలవారీగా కొంత నికరమైన మొత్తం తాను మనియార్డరుద్వారా ఆదిమూర్తికి పంపిస్తూ వస్తుంది. అయితే, అతను బిడ్డనుగూడా తనతోపాటు తీసుకెళ్ళిపోయి, ఆమె పంపిన డబ్బులోంచే పిల్ల పోషణభారాన్నిగూడా తానే వహించాలి.

ప్రతి నెలా కొంత డబ్బు కళ్ళ జూడవచ్చుననే ఒకే ఒక కారణంపైన ఆదిమూర్తి పదిహేను నెలల పసిపాపను చేతుల్లోకి తీసుకుని స్వస్థలం తిరుపతిలో రైలు దిగాడు.

'తిరుపతి వెస్ట్' స్టేషనుకు పశ్చిమంగా ఉన్న నగరం శివారు పేటల్లో ఆదిమూర్తికి నాలుగైదు బంధు కుటుంబాలున్నాయి. అందులో డబ్బు కక్కుర్తికి బాగా లోబడగల ఓ కుటుంబాన్ని అతను ఎన్నికచేశాడు. ఆ ఇంటి యజమాని పనీపాటా లేనివాడు. గోళ్ళు గిల్లుకుంటూ కూచుని, సులభంగా వచ్చే డబ్బులకోసం అర్రులు సాచేవాడు. టిఫిన్లు, తినుబండారాలుచేసి అమ్ముకుంటూ, అతని భార్య ఎట్లాగో ముగ్గురు బిడ్డలున్న కాపురాన్ని నెట్టుకొస్తోంది. నెలకింతని డబ్బు ముట్టజెప్పే షరతుపైన బిడ్డను ఆ ఇంట్లో అప్పగించి, ఆదిమూర్తి ఏడుకొండలవైపు తిరిగాడు. అద్దెకు గదులిచ్చే లాడ్జీ యజమానులకు, మనుషుల్ని కొండపైకి తోలుకెళ్ళే టాక్సీ డ్రయివర్లకు, పైన రకరకాల వస్తువులమ్ముకునే అంగడివాళ్ళకు దళారీగా వ్యవహరిస్తూ, యాత్రికుల్ని జలగలా పీల్చుకు తినడం వృత్తిగా పెట్టుకున్నాడు. ఆ వృత్తిలో ఆదిమూర్తి ప్రతాపానికి పట్టపగ్గాలు లేకపోయేసరికి పోలీసులు అతణ్ణి పట్టుకుని 'ఇక కొండవైపు తిరిగి చూశావో కటకటాలు తప్ప'వని హెచ్చరించి, మూడు నెలలపాటు వరుసగా ప్రతిరోజూ నంబర్ టూ టవును పోలీసుస్టేషనులో హాజరు వేయించుకోవలసిందిగా హుకూం జారీ చేశారు. ధర్మసత్రాలకు, ఆర్టీసి బస్ స్టేషనుకు, తిరుపతి

ఈస్టు రైలుస్టేషనుకు తన సంచారాన్ని కుదించుకోవలసి వచ్చినందున, తన చిన్నతనంలో తండ్రి చేస్తూ వచ్చిన హోమియోపతి వైద్యాన్ని గుర్తుకు తెచ్చుకుని, పది పదిహేను తెల్ల మాత్రల సీసాలు ప్లాస్టిక్ సంచిలో వేసుకుని, ఆదిమూర్తి రైలుపట్టాల కిరువైపులా వ్యాపించిన పేదవాడలలోకి వెళ్ళి అపర ధన్వంతరిలా ప్రత్యక్షమైపోయాడు.

***

ఆ గుడిసెల్లో కంటికి నదురైన ఓ ఆడమనిషి కనిపించి, తన చూపులతోనే ఆదిమూర్తి ప్రాణాలకు కొక్కీ తగిలించింది. 'నీకు నీ వారు లేరు, నాకు నా వారు లేరు' అంటూ మౌన భాషలోనే ఒక విప్పాల ప్రణయగీతం ముదలకించుకునేసరికి ఆదిమూర్తి అవశుడై, పరవశుడై అమాంతంగా ఆమె ఆశ్రయంలోకి జారిపోయాడు. ఇల్లలుకుతూ పేరు మరచిపోయిన ఈగలా అంతటితో తన పాలబడిన బిడ్డ ఒకతె ఉందన్న విషయమే అతను మరచిపోయాడు.

తల్లిచేత పరిత్యజించబడి, తండ్రిచేత నిర్లక్ష్యానికి గురైన పసిపిల్ల పెంపకంపట్ల బాధ్యత వహిస్తున్న దూరపు బంధువుకు, నెలకొకసారి ఆదిమూర్తిని వెదికి పట్టుకోవడమే దుర్లభమైపోయింది. అధవాపట్టుకున్నా, అతని దగ్గరనుంచి డబ్బు రాల్చుకోడం మరింత కష్టసాధ్యమైపోయింది. నోరూ వాయీలేక, ఆకలైతే అన్నం కావాలని అడగలేక, 'అయ్యా, ఇది కావాలి' అని కోరుకోలేక, తన ఏడుపును, దిగులును, దిక్కులేనితనాన్ని తనలోనే దిగమింగుకుంటూ ఉన్న పసిదానికి అందాకా ఉండిన నామమాత్రపు ఆదరణకూడా కరవైపోయింది. ఒకింత ఆప్యాయతకోసం, కాస్తంత ఆత్మీయలకోసం, పిసరంత దయాభిక్షకోసం ఆ పిల్ల బంధువుల ఇళ్ళ వెంటబడి తిరుగుతుంటే 'మరెక్కడున్నా సరే! మన ఇంటి దగ్గర ఉండకపోతే చాలు' అన్న తూష్ణీభావం బంధుబలగంలో బలిసిపోయింది.

"అదేనండీ కారణం! ఒక రాత్రి రాత్రంతా ఆ పిల్ల ఇక్కడపడి నిద్రపోతే ఎవరైనా పట్టించుకున్నారా?" అంటూ వసంత కథ చివరికొచ్చేసింది.

"బాగుందిలే వసంతా! శ్రమపడి కథంతా కూపీ లాగేశావు. కానీ, అందుకు మనమిప్పుడు చేయగలిగిందేమైనా ఉందంటావా" అనేశాను నోరుజారి.

"ఏం చేయగలం లెండి! నాకైనా ఒక పని సొంతంగా చేయగల ధీమా ఎక్కడేడ్చింది? నేనుగూడా ఒకరిపైన ఆధారపడి ఉన్నదాన్నే గదా!" కళ్ళు నులుపుకుని, కన్నీళ్ళు తుడిచేసుకుంటూ వసంత లోపలికి వెళ్ళిపోయింది.

బాబూ, ఈ కరెంటు స్విచ్చిని తాకనేగూడదు. పొరబాటున తాకామో, షాక్ కొట్టి తీరుతుంది అనుకుంటూ నా జాగ్రత్తలో నేనుండిపోదలచుకున్నాను.

అయితే, విషాదరసం ఒక అంతర్వాహినిలా మా ఇంటి వాతావరణంలో ప్రవహించడం మాత్రం ఆగలేదు.

"ప్రతిరోజూ వట్టి క్యారియర్‌తోనే వస్తోందటండీ? మధ్యాహ్నానికైనా ఆ సత్తు గిన్నెలో పట్టెడన్నం పెట్టి పంపనా?"

"వంటిమీద ఉన్న దుస్తులు వేసుకుని ఎన్నాళ్ళయిందో ఏమో! మాసి మసిగుడ్డల్లా ఉన్నాయి. ఏమండీ! సలీను బట్ట ఏదైనా కొని, ఓ జత దుస్తులు కుట్టిపెట్టరూ?"

"జ్వరం వచ్చిందటండీ, పాపం, హేమకెవరో చెప్పారట. తిండే పెట్టలేని వాళ్ళు హాస్పిటలుకు తీసుకెళ్తారా"

వసంత ఏమన్నా సరే, నేను పెదవులు బిగించేశాను. ముఖకవళికలు వ్యక్తం గాకుండా 'మాస్క్' తగిలించేశాను. మందలించలేను. ఊరడించలేను. కిముక్కుమనకుండా ఊరకుండిపోయాను.

***

మండు వేసంగికాలం. తిరుపతి ఎండలవేడి విజయవాడ ధాటిని మీరిపోతోంది. ఓరోజు రాత్రి భోజనాలైన తర్వాత మెట్టెక్కి డాబాపైకి వెళ్ళి చాప వేసుకున్నాము. హేమ నిద్రపోతోంది. నేను వెల్లకిల పడుకుని చందమామ వైపు చూస్తున్నాను. వసంత పక్కనే కూర్చుని తమలపాకుతో కిళ్ళీ కట్టి ఇస్తోంది.

"ఏమండీ... మరి... ఏమిటంటే..." నీళ్ళు నమలసాగింది.

"వింటున్నానుగా! చెప్పు" అన్నాను.

"హైదరాబాదులో రవీంద్రగారని మీకొక స్నేహితుడున్నాడని చెబుతుంటారు గదా. ఎత్తయిన కట్టడం, నాలుగో అంతస్తులో ఆఫీసు. లిఫ్టులోనే వెళ్ళవలసి ఉంటుందని..."

కట్టడాలు, లిఫ్టులు, ఆఫీసులు... ఈ నాందీవాచకం ఏ కొత్త నాటకానికి దారితీస్తుందో తెలియడం లేదు.

"ఆ రవీంద్రగారు తనకోసం గాకుండా లోకంకోసం ఎక్కువగా బతికేరకం అనిగూడా చెబుతుంటారు..."

"అవున్నిజమే. అందుకిప్పుడేమిటట..."

"మీరొకసారి హైదరాబాదు వెళ్ళి రావాలి..."

"ఎందుకూ?"

"నేనెట్లాగో తంటాలుపడి అడ్రసు సంపాదించాను. మీరు రవీంద్రగారిని వెంట బెట్టుకుని వెళ్ళి, తనూజ అనే ఆడమనిషిని కలుసుకోవాలి. ఇక్కడి పరిస్థితులన్నీ మీకు తెలిసినవే. ఇదంతా వివరంగా ఆ పుణ్యాత్మురాలి మనసుకెక్కేటట్లు చెప్పాలి. తాను గనుక అనుమతిస్తే మనం వాఖిరాను పెంచుకుంటామని తెలియజెయ్యాలి..."

అయిదు నిమిషాలపాటు వేచి చూసింది. నేను 'అరీ, గురీ' అనకపోయేసరికి మళ్ళీ కొనసాగించింది. "ఏమండీ! నేను ట్యూబెక్టమీ చేయించుకుంటానండీ! మనకిద్దరు బిడ్డలే చాలుననుకుందాం. సరేనా!"

"ఆ మాత్రం పనికి హైదరాబాదుదాకా ఎందుకు? ఇక్కడ ఆదిమూర్తితోనే తేల్చుకుంటే సరిపోలా..."

"మధ్యలో తాడూ తగాదా లేని ఆదిమూర్తి ఎవడండీ? పెళ్ళిగూడా చేసుకోలా. పాపపైన అతనికి తండ్రి హక్కు ఎక్కడినుంచి వస్తుంది? తనూజ సంగతలా కాదే? తల్లిగా తన హక్కు క్లెయిమ్ చేసుకోవడానికి ఆమె దగ్గర బిడ్డ బర్త్ సర్టిఫికెట్‌కూడా ఉంటుంది..."

నేను విభ్రాంతితో నిర్ఘాంతపడిపోయాను. పట్టరాని కోపాన్ని ఎట్లాగో అదుపులో పెట్టుకున్నాను. 'చూడు వసంతా! ఈ పిల్ల సమస్యనైతే నువ్వెట్లాగో పరిష్కరించగలవు. కానీ, లోకంలో ఇలాంటివాళ్ళు తక్కువగా ఉన్నారా? కన్నవారికి మోయరాని బరువుగా, పెంచేవారి పాదాలకు శృంఖలాలుగా తయారైపోయిన బిడ్డలు అసంఖ్యాకంగా అనాథ శరణాలయాల్లో లేరా? డస్ట్‌బిన్‌లోనుంచి ఏడుస్తూ, జీవించడానికోసం అంగలార్చరా? పేవ్‌మెంట్ల పైన మురికిగొట్టుకుపోయి కనిపించరా? అసలింతకూ సామాజిక సమస్యల్ని వ్యక్తిమాత్రులు తమ దయాదాక్షిణ్యాలతో పరిష్కరించడం సాధ్యమా? ఈ దేశంలో లేమి ఉంది. ఉబలాటం కొద్దీ కాలు జారడాలున్నాయి. బలవంతంగా మానభంగానికి గురికావడంకూడా ఉంది. దిక్కులేని బిడ్డల ఉనికికి ఇవన్నీ కారణాలేననుకునేవాళ్ళం.

చాలని దానికి కొత్త పరిస్థితుల్లో నుంచి కొత్త కారణాలు పుట్టుకొచ్చి పాతవాటికి జతపడుతున్నాయి. నువ్వా, నేనా దాన్ని పరిష్కరించవలసినవాళ్ళం? వద్దు. ఆ తనకుమాలిన ధర్మం జోలికి మనం వెళ్ళనే వద్దు' అంటూ నేను మా ఆవిడ సెంటిమెంట్లను శతఘ్ని పెట్టి తుత్తునియలుగా చేసెయ్యాలని కొద్ది నిమిషాలపాటు తలపోశాను. కానీ, అందువల్ల నెరవేరే ప్రయోజనమేమిటి? తగలరాని చోట తగిలిన దెబ్బవల్ల వసంత జీవితకాలమంతా కోలుకోకపోవచ్చు. నాకు కావలసింది కష్టసుఖాలు పంచుకుంటూ జీవనయాత్రలో తోడుగా ఉండగల సహచారిణి. హేమకు కావలసింది బాహ్య ప్రపంచపు కఠోర పరిస్థితులకడ్డంగా తనకు చలువపందిరిలా ఆవరించుకోగల కన్నతల్లి ప్రేమ. చిన్న బతుకు, చిన్న సంసారం. నేను చాలా సామాన్యుణ్ణి. నా స్వార్థం నాకు ముఖ్యం. ఏ తల్లి కన్నబిడ్డో నాకు తెలియదు. పెళ్ళయిన తర్వాత పుట్టింటి సంగతి తలపెట్టనే లేదు! 'ఏమండీ! నాకిది తెచ్చిపెట్టరూ' అని అడిగిన సందర్భమే లేదు. అవసరాలు కనిపెట్టి నేనే ఏదైనా తీసుకొస్తే 'అబ్బే ఇప్పుడెందుకండీ! ఉన్న ఖర్చులు చాలకనా?' అంటుండేది. వట్టి పిచ్చిది. నా వసంత మనసును నేనేనాటికీ గాయపరచను. లేదంటే ఆ సందర్భంలో గట్టిగా ఒక మాట చెప్పదలచుకున్నాను-

"నీ అభిమతం మేరకే నా ప్రయత్నం నేను మొదలెడతాను వసంతా! అయితే, ఒక షరతు. ఇకమీదట కన్నీటి కుండను నెత్తిపైన పెట్టుకోగూడదు. కలకంఠి కంట కన్నీరొలకడం నాకిష్టం లేదు. ఇందుకు నువ్వు ఒప్పుకోవాలి. ఏమంటావు?"

నా చేతులు రెండింటినీ తన చేతుల్లోకి తీసుకుంటూ అంది వసంత. "ఏమండీ! అంతగా మీరు నాతో చెప్పాలా? అయిదారేళ్ళ కాపురంలో నేనెప్పుడైనా మీ మనసుకు కష్టం కలిగించానా?"

ఎలాగైనా మా వసంత సిద్ధ సంకల్పురాలే! రవీంద్ర రాయబారం ఫలించింది. తనూజ మా ప్రతిపాదనకు అంగీకరించింది. తన సొంత దస్తూరితో, సంతకంతో బిడ్డను మేము పెంచుకోవడానికి అనుమతిని ప్రసాదించింది. ఆదిమూర్తి బిడ్డ జోలికి రాకుండా ఉండడంకోసం అతనికిచ్చే నెలసరి అలవెన్సులుగూడా రద్దుచేసి పారేస్తానని మాట ఇచ్చింది. ఇక చెప్పడానికేముంది? తుమ్మీ తుమ్మకముందే ఊడిపోయే ముక్కుల్లా, అంతంత మాత్రంగా వాఫిరా చుట్టూ అల్లుకుని ఉండిన మానవతా సంబంధాలు పుటుక్కు పుటుక్కున

తెగిపోయాయి. కొబ్బరికాయలోని నీళ్ళు వచ్చినంత అ(శమంగా ఆమె మా కుటుంబంలోకి వచ్చేసింది.

ఒకే రకంగా తల దువ్వి, ఒకే రకంగా దుస్తులు వేసి, ఒకే తరహా క్యారియర్లలో ఒకే విధమైన లంచ్ సర్ది, పాపలిద్దరూ జంటగా మెట్లుదిగి, పూలతోటగుండా నడిచి, వీధిలోకి వెళ్ళి మలుపు తిరిగి స్కూలువైపు నడిచిపోతుంటే, వరండాలో నిలబడి కనిపించినంతవరకూ చూస్తూ ఉండిపోతుంది వసంత.

"ఏమండీ! వెనుకనుంచి చూస్తుంటే కవల పిల్లల్లా లేరూ?"

"నిజమే! ఎటొచ్చీ వాఘిరా కొంచెం చిక్కిపోయినట్లుంటుంది."

"అదే, అదే. నేనొద్దన్నది. స్కూల్లోగూడా పేరు మార్పించేశాను. 'వనజా' అని పిలవండి. లక్షణంగా ఉంటుంది."

"ఒప్పుకున్నాను. అట్లాగట్లాగే."

❖ ఇండియా టుడే - 1996. ❖